# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర ప్రభుత్వం గడిచిన 15 నెలల్లో 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు సాధించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

- ❖ మొంథా తుఫాన్ ప్రభావం రాష్ట్రంపై రానున్న నాలుగు రోజుల పాటూ ఉంటుందని వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది.

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్" 127వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

- ❖ ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డే క్రికెట్ మ్యాచ్ లో భారత్ 9 వికెట్ల తేడాతో భారీ విజయం సాధించింది.

====================

యూఏఈ పర్యటన విజయవంతమైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఆయన ఈ పర్యటన ముగించుకొని ఈరోజు ఉదయం హైదరాబాద్ చేరుకున్నారు. అంతకుముందు పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టేందుకు ఈ పర్యటనలో భాగంగా పలువురు పారిశ్రామిక వేత్తలతో సమావేశమయ్యానని చెప్పారు. వారిని వచ్చే నవంబర్‌లో విశాఖపట్టణం వేదికగా జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనాలని ఆహ్వానించానని తెలిపారు. గత 15 నెలల్లో తమ ప్రభుత్వం 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు సాధించిందని, మరో 5 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాబట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రియల్ టైమ్ డేటా సహకారంతో రాష్ట్రంలో మెరుగైన పాలనను అందిస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ....

(వాయిస్ 32 సెకన్లు)

====================

విదేశాల్లో పని చేస్తున్న ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఉద్యోగులు, వలస కార్మికులు, విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రవాసాంధ్ర భరోసా బీమా పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రవాసాంధ్రుల సంక్షేమం, భద్రతలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏపీఎన్ఆర్టీ

సొసైటీ ద్వారా ప్రవాసాంధ్ర భరోసా బీమా పథకాన్ని అందిస్తోంది. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దుబాయ్ లో నిన్న ప్రారంభించారు. బీమా చేయబడిన వ్యక్తి ప్రమాదం వల్ల మరణించినా లేదా శాశ్వత అంగవైకల్యం కలిగినా ఈ పథకం కింద 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించబడుతుంది. ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు వెళ్లిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

====================

ఆత్మ నిర్భర్ భారత్ ద్వారా స్వదేశీ ఉత్పత్తులు దేశీయంగా తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని, వికసిత్ భారత్ సాధనలో అందరం పునరంకితం అవుదామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. అనంతపురంలోని ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో "ఆత్మనిర్భర్ భారత్" అనే అంశంపై మంత్రి ఈరోజు ప్రసంగించారు. స్వదేశీ, స్వభాషా, స్వభూష అనే ఈ మూడు స్తంభాలు ఆత్మనిర్భర్ భారత్‌కు చాలా కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులకు ఈ మూడు అంశాల ప్రాధాన్యాన్ని వివరించిన ఆయన, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని, మాతృభాషపై గర్వం కలిగి ఉండాలని, మన సంస్కృతి, వారసత్వాన్ని విలువైనదిగా భావించాలని సూచించారు.

====================

నాగుల చవితి సందర్భంగా ఏలూరు జిల్లాలోని నాగేంద్ర స్వామి ఆలయాలు, శివాలయాలు ఈరోజు భక్తులతో కిటకిటలాడాయి. సింగరాయపాలెంలో నాగేంద్ర స్వామి ఆలయం, అన్నవరంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం, రామన్నగూడెంలోని నాగేంద్ర స్వామి ఆలయం, గోపవరంలోని నాగేంద్ర స్వామి ఆలయం, నూజివీడు పట్టణంలోని శివాలయాలలో భక్తులు తెల్లవారుజాము నుండి పూజలు నిర్వహించారు. నాగులచవితి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టలో పాలు పోస్తే నాగ దోషాలు పోయి కోరికలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం.

విరామం

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 127వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.. "మన్ కీ బాత్" తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

====================

ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతోందని, ఇది గంటకు 7 కిలోమీటర్ల వేగంతో కదులుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి ఈ వాయుగుండం పోర్ట్ బ్లెయిర్ కి 440 కిలోమీటర్లు, విశాఖపట్టణానికి 970 కిలో మీటర్లు, చెన్నైకి 970 కిలోమీటర్లు, కాకినాడకి 990 కిలో మీటర్లు, ఒడిస్సాలోని గోపాల్‌పూర్ కు 1,040 కిలో మీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని పేర్కొన్నారు. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ రేపటికి తీవ్ర వాయుగుండంగా మారుతుందని, సోమవారం ఉదయానికి తుపానుగా బలపడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు తెలియజేస్తున్నారు. మంగళవారం ఉదయానికి తీవ్ర తుపానుగా మారి మచిలీపట్నం-కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని వెల్లడించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, తూర్పు గాలులు వీస్తున్నాయని.. వీటి ఫలితంగా రాబోయే రెండు రోజులకు సంబంధించిన వర్ష సూచనలను వాతావరణ అధికారి ఎం. వెంకట్రావ్ తెలియజేస్తూ…

(వాయిస్ 27 సెకన్లు)

====================

మొంథా తుఫాను ఈనెల 28వ తేదీన కాకినాడ సమీపంలో తీరాన్ని తాకుతుందన్న భారత వాతావరణ శాఖ సమాచారం మేరకు అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండి అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ జిల్లా కలెక్టర్లు సహా ఇతర అధికారులను ఆదేశించారు. తుఫాను ముందుస్తు సన్నాహక చర్యలపై ఆయన ఈరోజు అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాను ప్రభావం ఉండే అన్ని మండలాల్లో వెంటనే కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే గ్రామ స్థాయిలోని సిబ్బంది అంతా క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని విజయానంద్ ఆదేశించారు.

====================

ఆస్ట్రేలియాలోని సిడ్నీ వేదికగా ఈరోజు జరిగిన మూడో వన్డే క్రికెట్ మ్యాచ్ లో భారత్ 9 వికెట్ల తేడాతో భారీ విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 236 పరుగులకే ఆలౌట్ అయ్యింది. భారత బౌలర్ హర్షిత్ రాణా 4 వికెట్లు తీసి ప్రత్యర్థులను తక్కువ స్కోర్ కే నిలువరించడంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం భారత ఓపెనర్ రోహిత్ శర్మ 121, విరాట్ కోహ్లీ 74 పరుగులు చేసి రాణించడంతో లక్ష్యాన్ని 38 ఓవర్లకే సునాయాసంగా ఛేదించారు. తొలి రెండు మ్యాచ్ లలో భారత్ ఓటమి పాలవ్వడంతో మూడు మ్యాచ్ ల సిరీస్ ను 2-1 తేడాతో కోల్పోయింది. ఇక ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను రోహిత్ శర్మ దక్కించుకున్నాడు.

====================

తుపాను సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. తుఫానుకు ముందు వదంతులను నమ్మరాదని ప్రశాంతంగా ఉండాలని సూచించింది. వాతావరణ హెచ్చరికలు కోసం SMS లను గమనిస్తు ఉండాలని కోరింది. విశ్వసనీయమైన సమాచారం కోసం రేడియో వినాలని, వార్తా పత్రికలు చదవాలని పేర్కొంది. తుఫాన్ సమయంలో బయట ఉన్నట్లయితే దెబ్బతిన్న, పాత భవనాల్లోకి ప్రవేశించకూడదని, వీలైనంత త్వరగా సురక్షితమైన ప్రదేశంలో ఆశ్రయం పొందాలని సూచించింది.

====================
====================